నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, మంగళవారం 24 సెప్టెంబర్ 2024 HYDERABAD



**రోడ్లు జలమయం** | నగరంలో సోమవారం వర్షం దంచికొట్టింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చోట్ల వరదనీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. రోడ్లపై వరదనీరు నిలువడంతో ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



కమిటీ సభ్యులను వాహనంలో తరలిస్తున్న పోలీసులు

## బడికి డుమ్మా కొడితే.. పేరు తొలగిస్తాం

విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా చర్యలు

హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : బడికి డుమ్మా కొడితే ఇక పేరు తొలగించడమే. విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు వెళ్లి చదువుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు సక్రమంగా వచ్చేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ప్రతి పాఠశాలపై రిపోర్ట్ తీసుకుంటానని తెలిపారు. నెలకంటే ఎక్కువ రోజులు రాని విద్యార్థుల పేర్లు ఎఫ్ఆర్‌సీ నుంచి తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. కాగా, ప్రజావాణిలో భాగంగా 147 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్‌బాడీస్ కదిరవన్, ఆర్డీఓలు మహిపాల్, దశరథ్ సింగ్, జిల్లా అధికారులు ఆశన్న, పెరికె యాదయ్య, జిల్లా ఇంటర్ విద్యాధికారి వడ్డెన్న, కోటాజి, రాజేందర్ పాల్గొన్నారు.

### వైద్య సేవల్లో నిర్లక్ష్యం.!

**ముగ్గురికి షోకాజ్ నోటీసులు జారీ**

వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను హెచ్చరించారు. సమయానికి విధులకు హాజరు కాకుండా రోగులను ఇబ్బందులకు గురి చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. బంజారాహిల్స్‌లోని విమలానగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్‌ను పరిశీలించారు. సిబ్బంది వివరాలు ఆరా తీసి, ఆలస్యంగా రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులపట్ల నిర్లక్ష్యం వహించిన వైద్య సిబ్బంది విజయలక్ష్మి, నాగలక్ష్మి, పార్వతిలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్యాధికారికి ఆదేశాలిచ్చారు. కలెక్టర్ వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగకార్తీక్ తదితరులు ఉన్నారు.



# ఫలిస్తున్న కేసీఆర్ కల

## మురుగు నుంచి గ్రేటర్‌కు విముక్తి





పూర్తయిన నల్ల చెరువు ఎస్టీపీ

కేసీఆర్ హయాంలో రూ. **3866.41** కోట్ల వ్యయంతో ఎస్టీపీలు

విడతల వారీగా అందుబాటులోకి వస్తున్న మురుగునీటి శుద్ధి కేంద్రాలు

ఇప్పటికే ఐదు చోట్ల అందుబాటులోకి.. ప్రారంభానికి సిద్ధంగా మరో ఆరు

దక్షిణాసియాలోనే 100% శుద్ధి చేసే తొలి నగరంగా చరిత్ర సృష్టించనున్న హైదరాబాద్

*మరికొద్ది రోజుల్లో కేసీఆర్ కల సాకారం కానున్నది. హైదరాబాద్ నగరాన్ని మురుగునీటి నుంచి విముక్తి కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్టీపీ ప్రాజెక్టు పూర్తి ఫలాలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో గ్రేటర్‌కు మురుగునీటి నుంచి విముక్తి కలుగనున్నది. మూసీ ప్రక్షాళనలో భాగంగా నాటి బీఆర్ఎస్ సర్కార్ రూ. 3,866.41 కోట్లతో 1259.50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో 31 ఎస్టీపీలను 27 చోట్ల చేపట్టారు.*

వివరాలు IVలో..

## బీఆర్ఎస్ నేతలను అడ్డుకున్న పోలీసులు

బన్సీలాల్‌పేట, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): గాంధీ దవాఖాన పోలీసు క్యాంపు ఆఫీస్‌గా మారింది. ఏమి జరుగుతుందో తెలియక కొంత మంది రోగులు దవాఖాన బయటి నుంచే వెనుదిరిగారు. గత నెలలో జరిగిన మాతా శిశు మరణాల నేపథ్యంలో దవాఖానలో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. జరిగిన ఘటనపై నిజానిజాలు తెలుసుకునేందుకు సోమవారం గాంధీ దవాఖానకు వచ్చిన బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన నిజనిర్ధారణ కమిటీ సభ్యులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. కమిటీ సభ్యులు, వారికి మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణులు దవాఖానకు వస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు ఉదయం నుంచే దవాఖాన వద్ద భారీగా మోహరించారు. ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ గాంధీ దవాఖానకు చేరుకోవడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దాంతో వారికి, పోలీసులకు మధ్య వాగ్వాదం జరుగడంతో అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నిజనిర్ధారణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ... మాతా, శిశు మరణాల గురించి తెలుసుకునేందుకు వస్తే అడ్డుకుని, అరెస్టు చేస్తారా అని మండిపడ్డారు. చిన్నారులు పిట్టల్లా రాలిపోతుంటే వివరాలు తెలుసుకోవడం తప్పా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహా, విజయ్‌శంకర్, కే.దేవేందర్, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి చిలకలగూడ పీఎస్‌కు తరలించారు. సాయంత్రం వారిని సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు. కార్పొరేటర్ సునీత, నాయకులు ఎస్.రాజేందర్, శ్రీనివాస్, ఓ.రాజు, అనిత వారికి మద్దతుగా పీఎస్‌కు వచ్చారు.



గాంధీ దవాఖాన వద్ద బీఆర్ఎస్ నిజనిర్ధారణ కమిటీ సభ్యులను అడ్డుకుంటున్న పోలీసులు

